క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు పరామర్శ



జెడ్పీ చైర్‌పర్సన్ హారికను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ లీలా నవకాంతం

దెందులూరు: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికను దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జరిగిన దాడిని, హత్యాయత్నాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ హారిక భర్త రాము వివరించారు. ధైర్యంగా ఉండాలని తమ మద్దతు పూర్తిగా ఉంటుందని జెడ్పీటీసీ నవకాంతం, దెందులూరు మండల వైఎస్సార్ సీపీ నేత గంగరాజు చెప్పారు.

పాఠశాలకు సీసీ కెమెరాల అందజేత



సీసీ కెమెరాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: పూర్వ విద్యార్థులు నారాయణపురం హైస్కూల్‌కు సీసీ కెమెరాలను బుధవారం అందజేశారు. 1988–89 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు హైస్కూల్ హెచ్‌ఎం పోతురాజును కలిసి రూ.35 వేలతో సీసీ కెమెరాలను కొనుగోలు చేసి అందజేశారు. విద్యార్థులను హెచ్‌ఎం పోతురాజు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉదారతను అభినందించారు.

80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్లు



రైతులకు డ్రోన్ వినియోగాన్ని వివరిస్తున్న అధికారులు

నిడమర్రు: రైతులకు 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్లను అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.ఇంగర్ దైవ ఆశీర్వాదం తెలిపారు. పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా ఎనికేపల్లి గ్రామంలోని రైతులకు ఎమ్మెల్యే ధర్మరాజు డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో ఆశీర్వాదం మాట్లాడుతూ రూ.9.8లక్షల విలువైన డ్రోన్ 80 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నామన్నారు. రైతులు గ్రూప్‌గా ఏర్పడి రూ.1.96 లక్షలు చెల్లిస్తే కిసాన్ డ్రోన్లు అదిస్తున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో వార్డు నిర్మాణానికి ఆర్థిక సాయం

దెందులూరు: పోతునూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వార్డు నిర్మాణానికి గ్రామానికి చెందిన దాత కొమ్మిరెడ్డి రాంబాబు ఆర్థిక సాయం అందించారు. దాత అందించిన ఆర్థిక సాయంతో పోతునూరు వైద్యశాలలో భవిష్యత్తులో బాధితుల కోసం వైద్య సేవలు అందించేందుకు ఈ వార్డును ఉపయోగిస్తామని వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం నిర్మాణ పనులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మనమిత్ర యాప్‌తో నీటితీరువా పన్నులు



తహశీల్దార్ విజయకుమార్ రాజు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో రైతులు నీటి తీరువా పన్నులను మన మిత్ర వాట్సాప్ యాప్ ద్వారా చెల్లించొచ్చని ఏలూరు రూరల్ మండల తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు 9552309 నంబర్‌తో మనమిత్ర వాట్సాప్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని విజయకుమార్ రాజు తెలిపారు.

నీటి తీరువా పన్నును వాట్సాప్‌లో చెల్లించొచ్చు

నిడమర్రు: రైతులు నీటి తీరువా పన్నును వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా చెల్లించుటకు అవకాశం కలదని తహసీల్దార్ బి.దుర్గా ప్రసాద్ తెలిపారు. మరింత సమాచారం కోసం ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించాలన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా కందులపాటి

నిడమర్రు: పెదనింద్రకొలను విశాల పరపతి సంఘం నూతన చైర్‌పర్సన్ (అధ్యక్షుడు)గా కందులపాటి సత్యనారాయణ బుధవారం ప్రమాణ స్వీకారంచేసి బాధ్యతలు చేపట్టారు. త్రీమెన్ కమిటీలో మరో ఇద్దరు సభ్యులుగా బదిరెడ్డి శ్రీనివాసు, అల్లూరి శివరామ గోపాల్ కృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులను పూల మాలలతో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు అభినందించారు.

చినుకు పడదే.. సాగు సాగదే!

- వేసవిని మరపిస్తున్న ఎండలు
- నీరులేక ఎండుతున్న నారుమడులు, వరినాట్లు
- ముందుకు సాగని ఖరీఫ్ పనులు
- వర్షం కోసం రైతన్నల ఎదురుచూపులు



ఎండల తీవ్రతకు ఎండుతున్న దమ్ముచేసిన పొలం

గణపవరం: రుతుపవనాలు ముందే పలకరించాయి. అలాగే వర్షాలుకూడా అనుకున్న సమయాని కంటే ముందే, అవసరానికి మించి కురిసి రైతులను మురిపించాయి. జూన్ ఆరంభంలోనే తొలకరి పలకరించడంతో సాగుకు మంచి అనుకూల సమయం వచ్చిందని రైతులు ఎంతో ఆనందోత్సాహాలతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. నారుమడులు వేసి, పొలాలు మెట్ట దుక్కులు, దమ్ములు చేసి వరినాట్లు వేయడానికి సిద్ధమయ్యారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండగా ఇప్పటికే 20 నుంచి 25 శాతం రైతులు వరినాట్లు వేశారు. వీటిలో కూడా మెట్ట ప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాల్లోని బోర్ల ద్వారా సాగయ్యే భూముల్లో వరినాట్లు పూర్తి చేశారు. కాలువ కింద సాగయ్యే డెల్టా మండలాలైన నిడమర్రు, గణపవరం మండలాల్లో వరినాట్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. ఈ సమయంలో వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. రెండు వారాలుగా వర్షం చినుకులు కనిపిస్తే ఒట్టు. వర్షం కురవకపోతే పోయే, ఎండలు మండిపోతున్నాయి.

మండుతున్న ఎండలు

వేసవిలో కూడా లేనంత ఉష్ణ తాపంతో జనం అల్లాడిపోతున్నారు. వేసవిని మించి ఎండలు మండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు ఖరీఫ్ సాగుకు నీటి సమస్య ఏర్పడటంతో సాగు చతికిల పడింది. వరినాట్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పటికే మండలంలో కొమ్మర, గోపవరం, మొయ్యేరు పంట కాలువల ద్వారా సాగయ్యే భూములకు అవసరమైన సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. మండలంలో శివారు గ్రామం ఎస్.కొండేపాడు గ్రామానికి చుక్క సాగునీరు కూడా రాకపోవడంతో ఖరీఫ్ పనులు నిలిచిపోయాయి. నారుమడులు నీరు లేక నెర్రలు తీస్తున్నాయి. కనీసం దమ్ములు చేయడానికి నీరు లేక రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలోని గణపవరం, చినరామచంద్రపురం, జగన్నాథపురం, కొత్తపల్లి, సరిపల్లె, వరదరాజపురం, మొయ్యేరు, పిప్పర, వెంకట్రాజపురం, ముప్పర్తిపాడు, కేశవరం తదితర గ్రామాలలో సరిపడ సాగునీరు అందక ఖరీఫ్ పనులు అడుగు ముందుకు పడటం లేదు. ఖరీఫ్ సీజన్ మొదలై మూడు వారాలు అవుతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దీనితో జూన్ రెండోవారంలో విత్తనాలు వేసినా రైతులకు అవసరమైన నీటి తడులు అందక మొలకశాతం కూడా తగ్గిపోయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో సుమారు 13 వేల ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు జరుగుతుండగా ఇప్పటివరకూ మూడు వేల ఎకరాలకు మించి నాట్లు పడలేదు. ఆదిలోనే హంసపాదు అన్నట్లు సీజన్ ఆరంభంలోనే వరుణుడు వెనక్కి తగ్గడంలో భానుడు తన విశ్వ రూపాన్ని చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతూ సాగుకు గండంగా మారింది. మరో వైపు సాగునీరు సరిపడ అందకపోవడంతో రైతులు నారుమడులను వరినాట్లను కాపాడుకోవడానికి ఇంజన్లతో నీరు తోడుకుంటూ, వరుణ దేవుడి కటాక్షం కోసం ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గంలో వరిసాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం
గణపవరం	12,672 ఎకరాలు
నిడమర్రు	3,450 ఎకరాలు
ఉంగుటూరు	24,053 ఎకరాలు
భీమడోలు	12,734 ఎకరాలు



నీరు లేక ఎండిపోతున్న నారుమడి



పొలంలోకి ఇంజన్‌తో నీరు తోడుకుంటున్న రైతు



కేశవరం ఆయకట్టులో నీరు లేక దమ్ము చేయని పొలాలు

ఉచితంగా డెంగీ నిర్ధారణ పరీక్షలు



డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: డెంగీ నిర్ధారణ పరీక్షలు కైకరం వెల్‌నెస్ సెంటర్‌లో చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం కైకరంలో డెంగీపై అవగాహన ర్యాలి నిర్వహించారు. విపరీతమైన జ్వరం, కీళ్ల నొప్పులు, శరీరం దద్దుర్లు, కనురెప్పలు వాయడం వంటి లక్షణాలు ఉంటే డెంగీ లక్షణాలుగా భావించొచ్చని తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ వద్ద ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యాధికారి పర్యవేక్షణలో చికిత్స చేస్తారని డెంగీ నిర్ధారణ సర్వజన ఆసుపత్రి ఏలూరులోచేస్తారని లక్ష్మణరావు వివరించారు. రక్త నమూనాలు సేకరించి పంపుతామని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు జయశ్రీ, ప్రీతి, ఆరోగ్య కార్యదర్శులు విజయశ్రీ, సునీత, వెంకటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు, దయామణి, వరలక్ష్మి, విజయలక్ష్మి, జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

దెందులూరు: చట్టాలు, శిక్షలపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని పెదవేగి సీఐ రాజశేఖర్ అన్నారు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ ఆధ్వర్యంలో దళితవాడలో చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రశాంతమైన సమాజంలో ఏ ఒక్కరికీ అసౌకర్యం కలిగించకుండా శాంతి సామరస్యంతో జీవించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

కోవిడ్‌లో సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయం

భీమడోలు: సచివాలయ ఉద్యోగులు కోవిడ్ సమయంలో చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు అభినందన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ రహీమాబేగం మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు తీసుకెళ్లి నిబద్ధతతో విధులను నిర్వహించారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందించారన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు రమేష్, రాజా, అఖిల్, శాంతి ప్రియ, జ్యోతి, జోషిలను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి యు.జయ రామకృష్ణ, వీఆర్వో సాల్మన్, గ్రామ పెద్దలు గంజి నాగేశ్వరరావు, శ్యామ్‌రాజు, మునగంటి రమేష్, మద్దు శ్రీను, వీర్నాల గోవింద్, దూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న ఉద్యోగులను అభినందిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం, సిబ్బంది

బదిలీలతో ఎంపీడీవో ఆఫీసు బిజీబిజీ

ఉంగుటూరు: సచివాలయాల ఉద్యోగులకు బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఉద్యోగులు బదిలీల్లో నిమగ్నమయ్యారు. వారం రోజుల నుంచి హడావుడిగా సచివాలయ ఉద్యోగులు తిరుగుతున్నారు. సమీప గ్రామాల్లో బదిలీలకు మక్కువ చూపుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, గ్రేడ్–5 కార్యదర్శులు, వ్యవసాయ అసిస్టెంట్లు ఇలా సచివాలయంలోని పలు విభాగాలకు చెందిన వారు బదిలీలకు దరఖాస్తులు చేసుకోవడం, రిలీవ్ అవడం, వేరే చోట చేరడం చేస్తున్నారు. ఈ ప్రక్రియలతో ఉద్యోగులు హడావుడిగా ఉన్నారు. దీంతో ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయానికి కొత్తగా వచ్చే వారిని చేర్చుకోవడం, వెళ్లేవారికి రిలీవ్ ఇవ్వడం వంటి పనుల్లో ఎంపీడీవో రాజ్‌మనోజు బిజీగా ఉన్నారు.

కేసుల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి ప్రియదర్శిని నూతక్కి, న్యాయవాదులు, విద్యార్థులు

భీమడోలు: కేసుల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి అన్నారు. భీమడోలులో బుధవారం మీడియేషన్ ఫర్ నేషన్ నినాదంతో ఒక కిలో మీటర్ వాక్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమాన్ని భీమడోలు కోర్టు వద్ద జడ్జి ప్రారంభించారు. భీమడోలు జంక్షన్‌లో వారు మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి మాట్లాడుతూ కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండడంతో వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కేసులు పరిష్కారం ద్వారా కలిగే ప్రయోజనాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యే కేసులపై కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు అవగాహన పెంచుకోవాలన్నారు. కోర్టు పెండింగ్‌లో ఉన్న కేసులకు మీడియేషన్ ద్వారా పరిష్కారం ఏర్పడుతుందన్నారు. ఇది ఒక స్వచ్ఛంద కార్యక్రమం అని తెలిపారు. ఈ నెల నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు 90 రోజుల జరిగే ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో రహదారులు ధ్వంసం

ఉంగుటూరు: నారాయణపురం వద్ద ఏలూరు గోదావరి కాలువపై వంతెన పడిపోవడంతో దాని ప్రభావం ఉంగుటూరు మీద పడింది. ఆ వాహనాలన్నీ నారాయణపురం రాజుల కాలనీ వద్ద నుంచి ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయ రహదారికి రావడంతో రహదారులు దెబ్బతిన్నాయి. ఆ రహదారిలో ఉన్న కల్వర్టులు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే నాచుగుంట బ్రిడ్జి కూడా మూడు చోట్ల దిగబడి గుంతలు ఏర్పాడ్డాయి. మంచినీటి పైపులైన్లు మూడుచోట్ల దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడటమే కాకుండా మరమ్మతుల ఖర్చు పంచాయతీకి అదనపు భారంగా మారింది. పైపులైన్లు తిరిగి పునర్నిరించడం, కల్వర్టు నిర్మించడం పనులు గ్రామ పంచాయతీ చేపడుతుంది. ఆర్థికంగా పంచాయతీపై భారం పడింది. నాచుగుంట వంతెన వద్ద పండిన గుంతల్లో మట్టి పోసి వాహనాలు నడిపేస్తున్నారు. బరువైన భారీ వాహనాలు తిరిగితే ఆ వంతెన కూడా కృంగిపోయే ప్రమాదం ఉంది. భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయ రోడ్డులో కల్వర్టు నిర్మిస్తున్న పంచాయతీ సిబ్బంది

టీచర్ల నియామకం కోరుతూ దీక్ష

కుక్కునూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ కోరుతూ విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్ సీపీ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్, కాంగ్రెస్, సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్‌లో బుధవారం రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు లెనిన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి 34 రోజులు గడిచాయని మరికొన్ని రోజుల్లో ఎఫ్ఏ 1 పరీక్షలు కూడా నిర్వహించనున్నా విద్యార్థులకు ఇంతవరకు సిలబస్ ప్రారంభం కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బదిలీ చేస్తుంటే కుక్కునూరు ఎంఈఓ బాబురావు అనాలోచితంగా వ్యవహరించారని విమర్శించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



బువ్వనపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో భాస్కర్

నిడమర్రు: మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని ఎంఈవో ఐనపర్తి భాస్కర కుమార్ సూచించారు. బుధవారం ఆయన బువ్వనపల్లి హైస్కూల్‌ను, ఆదర్శ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉంటుందా అని పిల్లలను అడిగి తెలుసుకొని, పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా తమకు ప్రతి నెలా సక్రమంగా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎండీఎం నిర్వాహకులు ఎంఈవోకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తనిఖీ చేశారు. నూతన అడ్మిషన్ల వివరాలను పరిశీలించారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు 69 మంది ఉన్నారని, కనీసం 100 మంది విద్యార్థులు ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నూతనంగా హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయినందున వసతి సమస్య తీవ్రంగా ఉందని, కనీసం నాలుగు అదనపు గదులు అవసరమని హెచ్‌ఎం సంకు ఏసుబాబు ఎంఈవోకు వివరించారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని, విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు: మండలంలోని విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల నిమిత్తం ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని విద్యుత్ శాఖ డీఈ కేఎం అండేడ్కర్ తెలిపారు. పెదపాడు సెక్షన్ పరిధిలో గోగుంట ఫీడర్, పాతముప్పర్రు సబ్‌స్టేషన్ పరిధిలోని వీరమ్మకుంట ఇండస్ట్రియల్ ఫీడర్, ఏపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అప్పనవీడు ఫీడర్, కలపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో కలపర్రు హెడ్ క్వార్టర్ ఫీడర్లలో లైన్లకు ట్రీ కటింగ్ పనులు చేపట్టనున్నామని ఆయన అన్నారు. తోటగూడెం, పునుకొల్లు, వసంతవాడ, గోగుంట, పాతముప్పర్రు, జయపురం, వీరమ్మకుంట అప్పనవీడు, ఏపూరు, తాళ్లమూడి, కలపర్రు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.

పలు గ్రామాల్లో..

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలోని సూరప్పగూడెం సబ్‌స్టేషన్ ఏరియా కొత్త బ్రేకర్ మార్పు చేసే నిమిత్తం ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శివాజీ బుధవారం రాత్రి తెలిపారు. గుండుగొలను, భీమడోలు, నాగహనుమాన్, సూరప్పగూడెం,, పొలసానిపల్లి ఆక్వా కల్చర్, పరిశ్రమల ఫీడర్ల పరిధిలోని భీమడోలు, అర్జావారిగూడెం, సూరప్పగూడెం, పొలసానిపల్లి, పాతూరు, దిగిలుపాటిదిబ్బ గ్రామాల్లోని విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు.

● ఆడపడుచులం.. ఆగండి



పినకడిమిలో పట్టి వేసి, వాహనాలను ఆపుతున్న మహిళా కూలీలు

వరినాట్లు సమయంలో రహదారుల వెంట ఎక్కడ చూసినా ప్రధానంగా కన్పించేది వరి నారు పట్టుకొని వాహన చోదకులను ఆపి, సొమ్ములు వసూలు చేయడం. ఈ పద్ధతి సంప్రదాయబద్ధంగా వస్తోందని చెబుతుంటారు. కాగా ఈ విధానం గతంలో వరినాట్ల సమయంలో బావ వరస అయ్యేవారు చేలోకి వస్తుంటే మరదలి వరస అయ్యేవారు ఆపి, పసుపు, కుంకుమలకు నగదు ఇవ్వాలని పట్టుబట్టేవారు. అయితే ఇది కేవలం చేల గట్లకే పరిమితం అయ్యేది. ఇటువంటి దృశ్యమే బుధవారం పినకడిమి రోడ్డులో కనిపించింది. - పెదవేగి

దాతల దాతృత్వం అభినందనీయం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దాతలు

దెందులూరు: జోగన్నపాలెం ఉన్నత పాఠశాలకు దాతల దాతృత్వం అభినందనీయమని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఇన్‌చార్జి పంకజ్ కుమార్ అన్నారు. బుధవారం జోగన్నపాలెం ఉన్నత పాఠశాలలో దివంగత హెచ్‌ఎం ఈడుపుగంటి విష్ణు కుటుంబ సభ్యులు ఇచ్చిన రూ.5 లక్షలతో బాలురు, బాలికలకు బాత్‌రూమ్‌లు, హార్క్ సంస్థ ఇచ్చిన రూ.3 లక్షలతో టేబుళ్లు, ఫ్యాన్లు, బెంచీలను ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఈడుపుగంటి నాగ ధనుంజయ రావు ఇచ్చిన రూ.లక్షతో ఆర్వో ప్యూరిఫైర్ సిస్టం, చైర్మన్ శ్రీరామ్ నిర్మించిన కళా వేదికను అతిథులు ప్రారంభోత్సవాలు చేశారు. చైర్మన్ శ్రీరామ్ కరస్పాండెంట్ పుట్లగుంట ఇందిరా మాట్లాడుతూ ఈ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు నేడు అనేక ప్రాంతాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం పాఠశాలకు శ్రీరామరక్షగా అభివర్ణించారు. దివంగత హెచ్‌ఎం విష్ణు సతీమణి ఉపాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ తన భర్త ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేశారని ఆయన పనిచేసిన కాలంలో విద్యార్థినీ, విద్యార్థుల బాత్‌రూమ్ అవసరాలకు ఏదో ఒకటి చేయాలని భావించారన్నారు. ఆయన ఆశయానికి అనుగుణంగా తమ కుటుంబం రూ.5 లక్షలను వెచ్చించామని తెలిపారు. తాను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే ఈ పాఠశాలపై మక్కువతో సాయంత్రం సమయంలో ఇంగ్లీష్ క్లాసులు తీసుకొని విద్యార్థుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఏపీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ, పాఠశాల హెచ్‌ఎం కె.రవిచంద్ర, దాతల కుటుంబ సభ్యులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

పెరిగిన వర్జీనియా ధర

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర ఒక్కసారిగా పెరిగింది. బుధవారం కేజీ రూ.33 పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం రూ.359 పలికిన వర్జీనియా ధర కేజీ బుధవారం రూ.392కు చేరింది. ఈ ధర ఏలూరు జిల్లాలో ఉన్న జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో రూ.392, జంగారెడ్డిగూడెం–1, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో రూ.391 పలికింది. వేలం ప్రారంభ సమయంలో కేజీ ధర రూ.290 పలికింది. ఈ ధర చాలా రోజులు స్థిరంగానే కొనసాగింది.

మున్సిపల్ కార్మికుల నిరసన

చింతలపూడి: సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను అంగీకరించాలని కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. జీఓ 36 ప్రకారం తమకు రావాల్సిన రూ.21,000 జీతం ఇవ్వకుండా రూ.15,000 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. 2021 జనవరిలో నగర పంచాయతీ అయిన నాటి నుంచి పెరిగిన జీతాల ప్రకారం ఒక్కొక్కరికీ రూ.2 లక్షలపైనే జీతాల ఎరియర్స్ బకాయి ఉందని, ఉద్యోగ విరమణ వయస్సు పూర్తయిందన్న పేరుతో కార్మికులకు రావాల్సిన జీతాల ఏరియర్స్ కూడా ఇవ్వకుండా ఉత్తచేతులతో ఇంటికి పంపిస్తున్నారని ఆరోపించారు. క్యాజువల్ లీవులు, జాతీయ పండుగ సెలవులు అధిక గంటలు పని చేయిస్తున్నారని, ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు.